# నమస్తే ఉదయం
తెలుగు దినపత్రిక

సంపుటి: 4 | సంచిక: 47 | పేజీలు: 4 | వెల: రూ.4/- | శుక్రవారం 16 అక్టోబర్ 2026 | ఎడిటర్: ఎం.వనితా రెడ్డి

# తాగు, సాగునీటితో పాటు విద్యుత్ సమస్య

## ఎల్‌నినో పరిస్థితులు, భవిష్యత్ కార్యాచరణపై సీఎం రేవంత్ రెడ్డి చర్చ



**హైదరాబాద్, అక్టోబర్ 15 (నమస్తే ఉదయం)**

ఎల్‌నినో విపత్తు ప్రపంచవ్యాప్తంగా అన్ని దేశాలను వణికిస్తోందన్న సీఎం రేవంత్ రెడ్డి శాస్త్రవేత్తలు ఊహించినట్లుగానే పరిస్థితులు చేయిదాటి పోయేలా ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. రాబోయే రోజుల్లో నీరు, విద్యుత్ కొరతను తీవ్రంగా ఎదుర్కోబోతున్నామని హెచ్చరించారు. అక్టోబర్‌లో ఈ స్థాయి విద్యుత్ వినియోగం చరిత్రలో ఎప్పుడూ లేదని, మార్కెట్‌లో విద్యుత్ ఏ ధరకు దొరికినా కొనేందుకు ప్రయత్నిస్తున్నామని తెలిపారు.

### యాసంగిలో వరి పంట వేయొద్దు

కేంద్రం నుంచి ఎలాంటి సహాయం పొందాలనే అంశంపై చర్చించామని, గతేడాది ఈ సమయానికి 400 టీఎంసీలకు పైగా అందుబాటులో ఉందని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. ఈ ఏడాది అన్ని రిజర్వాయర్లలో కలిపి 209 టీఎంసీలు మాత్రమే ఉన్నాయని అన్నారు. ఎప్పుడు కరవు వచ్చినా ఈ దేశాన్ని ఆదుకున్నది రైతులు మాత్రమే అని కొనియాడారు. అందుబాటులో ఉన్న నీటినే పొదుపుగా వాడుకోవాలని, నీటి కొరతను దృష్టిలో పెట్టుకుని యాసంగి పంటలు తగ్గించుకోవాలని, ఈ సీజన్‌లో పంటలు పండించటాన్ని వాయిదా వేసుకోవాలని, పెద్ద మనసు చేసుకుని యాసంగిలో వరి పంట వేయొద్దని విజ్ఞప్తి చేశారు. ఉన్న నీటిని తాగునీటి అవసరాలకే వాడుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని, వచ్చే 8, 10 నెలలు నీటిని పొదుపుగా వాడుకోవాలని సూచించారు.

### కేంద్రం సహాయం చేయాలి

ఎల్‌నినో కష్ట కాలంలో రాష్ట్రాలను కేంద్రం ఆదుకోవాలని, కేంద్ర- రాష్ట్ర ప్రాయోజిత పథకాల్లో కేంద్ర నిధుల వాటా పెంచాలని కోరారు. కేంద్రం నుంచి అధిక నిధులు పొందే కార్యాచరణ రూపొందించాలని ఆదేశించామని తెలిపారు. రాష్ట్రానికి అదనపు విద్యుత్‌ను ఇవ్వాలని కేంద్రాన్ని కోరారు. విద్యుత్‌పై ఇచ్చే సబ్సీడీలను పెంచాలని కేంద్రానికి విజ్ఞప్తి చేశారు. కొవిడ్ సమయంలో ప్రధాని మోదీ చెప్పినవి చేశామని, కష్టకాలంలో రాజకీయాలు చేయకుండా ఏం చెప్పినా చేశామని అన్నారు. ఇప్పుడు విపక్షాలు కూడా రాజకీయం చేయకుండా ప్రభుత్వంతో కలిసి రావాలని పిలుపునిచ్చారు. ప్రకృతి విపత్తును జయించడానికి అందరి సహకారం కావాలని, దుష్ప్రచారాలను నమ్మకుండా అందరూ సంయమనంతో ఉండాలని తెలిపారు.

### రిజర్వాయర్లు అన్నీ ఖాళీ అయ్యాయి

రైతులను ఆదుకునేందుకు అన్ని ప్రయత్నాలు చేస్తున్నామని, కృష్ణా బేసిన్‌లో నీటి నిల్వలు 72 శాతం తక్కువ ఉన్నాయిని, గోదావరి బేసిన్‌లో నీటినిల్వలు 40 శాతం తక్కువ ఉన్నాయని వెల్లడించారు. చలికాలం రాకముందే రిజర్వాయర్లు ఎండిపోతున్నాయని, రిజర్వాయర్ల నుంచి 24వేల గ్రామాలకు తాగునీరు అందించాల్సి ఉందని, నీటి కొరత వల్ల 12 లక్షల ఎకరాల పంటలకు నష్టం జరిగే అవకాశం ఉందని, హైదరాబాద్‌కు నీరు అందించే జలశయాల్లో కూడా నీరు లేదని వివరించారు.

## విద్యుత్ కోతలపై సీఎం రేవంత్‌రెడ్డి

# తీవ్ర అసంతృప్తి

**విద్యుత్ శాఖలో ఉన్నతాధికారి సస్పెన్షన్**

**యాదాద్రి థర్మల్ ప్లాంట్ చీఫ్ ఇంజినీర్ బి.సురేశ్ సస్పెన్షన్**

**విధుల్లో నిర్లక్ష్యమే చర్యలకు కారణమని టీజీ జెన్‌కో ఉత్తర్వులు**

**విద్యుదుత్పత్తి పెంపు పనుల్లో పర్యవేక్షణ లోపాలున్నట్లు ఆరోపణ**

**హైదరాబాద్, అక్టోబర్ 15 (నమస్తే ఉదయం)**



తెలంగాణలో విద్యుత్ కోతలపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేసిన గంటల వ్యవధిలోనే ప్రభుత్వం చర్యలకు దిగింది. విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించారనే ఆరోపణలతో యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్ (వైటీపీఎస్) స్టేజ్-1 చీఫ్ ఇంజినీర్ బి. సురేశ్‌ను సస్పెండ్ చేసింది. టీజీ జెన్‌కో సీఎండీ డాక్టర్ ఎస్.హరీశ్ ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు. విద్యుదుత్పత్తి పెంపునకు ప్రాధాన్య పనుల ప్రణాళిక, పర్యవేక్షణ, అమలులో ఆయన తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శించారని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. శాఖాపరమైన విచారణ పూర్తయ్యే వరకు సస్పెన్షన్ కొనసాగనుంది. బుధవారం సాయంత్రం ఉన్నతాధికారులతో నిర్వహించిన సమీక్షలో సీఎం రేవంత్‌రెడ్డి రాష్ట్రంలో విద్యుత్ కోతలపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. నైనీ, మహానది బొగ్గు బ్లాకుల నుంచి బొగ్గు సరఫరా ఉన్నప్పటికీ యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్‌లో పూర్తి సామర్థ్యంతో విద్యుదుత్పత్తి ఎందుకు జరగడం లేదని అధికారులను ప్రశ్నించారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి నవీన్ మిత్తల్, టీజీ జెన్‌కో సీఎండీ ఎస్.హరీశ్‌పైనా చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు. రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో పంటలు ఎండిపోకుండా వ్యవసాయానికి నిరంతర విద్యుత్ సరఫరా చేయాలని సీఎం ఆదేశించారు. పంట చేతికొచ్చే వరకు విద్యుత్ కోతలు లేకుండా చూడాలని స్పష్టం చేశారు. రానున్న 20 రోజులు పంటలకు కీలకమని, విద్యుత్ కొరత కారణంగా రైతులు నష్టపోయే పరిస్థితి ఎట్టి పరిస్థితుల్లోనూ రాకూడదని అన్నారు. వ్యవసాయ విద్యుత్ డిమాండ్ అధికంగా ఉన్న ప్రాంతాలను గుర్తించి సరఫరా పెంచాలని అధికారులకు సూచించారు. రాష్ట్రంలో లోటు వర్షపాతం, ఎల్‌నినో ప్రభావం, విద్యుత్, తాగునీటి సరఫరా పరిస్థితులపైనా సీఎం సమీక్ష నిర్వహించారు. విద్యుత్ సరఫరా మెరుగుపర్చాలని పలుమార్లు ఆదేశించినా పరిస్థితిలో మార్పు రాకపోవడంపై అసహనం వ్యక్తం చేశారు.

## వరంగల్ హాస్పిటల్‌లో దసరా నుంచి సాఫ్ట్ లాంచ్ ఓపీ సేవలు: పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి



**హైదరాబాద్, అక్టోబర్ 15 (నమస్తే ఉదయం)**

వరంగల్ మల్టీ సూపర్ స్పెషాలిటీ ఆసుత్రిలో దసరా నుంచే సాఫ్ట్ లాంచ్ ఓపీ సేవలు ప్రారంభించబోతున్నందుకు సంతోషంగా ఉందని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. పేదలకు కార్పొరేట్ వైద్యం అందించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఆస్పత్రి నిర్మాణ పనులు తుది దశకు చేరుకున్నాయని చెప్పారు. మళ్లీ ఈనెల 17న పనులను పరిశీలిస్తామని పేర్కొన్నారు. గురువారం మంత్రి సీతక్కతో కలిసి ఆస్పత్రిని కలియతిరిగి పరిశీలించారు. వైద్యులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో పొంగులేటి మాట్లాడారు. గత ప్రభుత్వం నిర్మించి తలపెట్టి అసంపూర్తిగా వదిలేసిన

..మిగతా 2లో

## రూ.3 వేల కోట్ల విదేశీ బొగ్గు స్కామ్ ఆపండి

**రేవంత్‌రెడ్డికి కేటీఆర్ బహిరంగ లేఖ**

**భోత్రా లాజిస్టిక్స్‌తో ప్రభుత్వం, సింగరేణి చేసుకున్న రహస్య అగ్రిమెంట్లు బయటపెట్టాలి**

**మొత్తం కుంభకోణంపై స్వతంత్ర సంస్థతో విచారణ జరిపించాలి**

**కేటీఆర్ డిమాండ్**

**హైదరాబాద్, అక్టోబర్ 15 (నమస్తే ఉదయం)**




రాష్ట్రంలో కావాలనే బొగ్గు, కరెంటు సంక్షోభాన్ని సృష్టించి.. విదేశీ బొగ్గు దిగుమతి ముసుగులో రూ.3 వేల కోట్ల భారీ స్కామ్‌కు రేవంత్ రెడ్డి కుట్ర చేస్తున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. భోత్రా లాజిస్టిక్స్ అనే అనుమానాస్పద కంపెనీతో ముఖ్యమంత్రి ముందే చీకటి ఒప్పందం కుదుర్చుకుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం, సింగరేణి చేసుకున్న అన్ని రహస్య అగ్రిమెంట్లు బయటపెట్టాలన్నారు. ఏ ప్రాతిపదికన సదరు కంపెనీని ఎంపిక చేశారో రేవంత్ సమాధానం చెప్పాలన్నారు. మొత్తం కుంభకోణంపై స్వతంత్ర సంస్థతో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ఈమేరకు గురువారం సీఎం రేవంత్‌రెడ్డికి కేటీఆర్ బహిరంగ లేఖ రాశారు.

# అర్హులైన ప్రతి పేదవాడికి ప్రభుత్వం రేషన్ కార్డు: ఎమ్మెల్యే జిఎంఆర్

## లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేసిన ఎమ్మెల్యే జిఎంఆర్

**కొత్తకోట, అక్టోబర్ 15(నమస్తే ఉదయం)**





అర్హులైన ప్రతి పేదవాడికి ప్రభుత్వం రేషన్ కార్డు అందజేస్తుందని దేవరకద్ర నియోజకవర్గం ఎమ్మెల్యే జిఎంఆర్ అన్నారు. గురువారం కొత్తకోట మున్సిపాలిటీ కేంద్రంలోని ఆర్కే గార్డెన్స్ లో కొత్తకోట మండలం , మున్సిపాలిటీకి చెందిన రేషన్ కార్డు లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ , రెండో విడత ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు ప్రొసీడింగ్స్ , సీఎం రిలీఫ్ ఫండ్ లబ్ధిదారులకు చెక్కులను ఎమ్మెల్యే జిఎంఆర్ అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జియంఆర్ మాట్లాడుతూ..గత బిఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అప్పులకు, మిత్తిలు కట్టుకుంటూ కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేరుస్తుందన్నారు. అందులో భాగంగా ఇప్పటికే మహిళలకు ఉచిత బస్ ప్రయాణం, 2 లక్షల పంట రుణమాఫీ, 500లకే గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల ఫ్రీ కరెంట్, 10 లక్షల ఆరోగ్యశ్రీ, సన్న బియ్యం, ఇందిరమ్మ ఇండ్ల తో పాటు రేషన్ కార్డులు ఇచ్చామన్నారు. పేద ప్రజల సంక్షేమమే లక్ష్యంగా పని చేస్తూ, పైరవీలకు తావు లేకుండా ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులను మంజూరు చేసినట్లు తెలిపారు. ఒక్క కొత్తకోట మండలంలో 524 ఇందిరమ్మ ఇండ్లు, కొత్తకోట పట్టణము లో 146 ఇందిరమ్మ ఇండ్లు మొత్తం 670 ఇండ్లు మొదటి విడత లో ప్రస్తుతం రెండో విడత గుడిసెలు ఉన్నవారికి 73 ఇండ్లు ఇస్తున్నామని తెలియజేశారు. పదేండ్లు అధికారంలో ఉన్న బిఆర్ఎస్ ప్రభుత్వం ఒక్క రేషన్ కార్డు ఇవ్వలేదని పేర్కొన్నారు, ముఖ్యంగా కొత్తకోట పట్టణంలోని ఒక్క డబల్ బెడ్ రూమ్ ఇల్లు కూడా ఇవ్వలేదని గత ప్రభుత్వ తీరుపై విరుచుకుపడ్డారు. పేదలకు సంక్షేమ పథకాలు అందిస్తుంటే బిఆర్ఎస్ ఓర్వలేక పోతుందన్నారు, అప్పుడు కానీ, ఇప్పుడు కానీ పేదలకు ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులు ఇచ్చిన ఘనత కాంగ్రెస్ పార్టీకే దక్కుతుందన్నారు. ప్రతి ప్రభుత్వ పథకం అమలు అవ్వాలంటే రేషన్ కార్డు తప్పనిసరి అని, పేదలకు రేషన్ కార్డు ఆత్మగౌరవం లాంటిదని, అలాంటి ముఖ్యమైన రేషన్ కార్డులను గత బిఆర్ఎస్ ప్రభుత్వం ఇవ్వకపోవడంతో పేదలు అనేక ఇబ్బందులు పడ్డారని అన్నారు. పేదల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని సమర్ధంగా రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టామని, అర్హులైన ప్రతీ ఒక్కరికి స్మార్ట్ రేషన్ కార్డులు అందజేస్తున్నట్టు తెలిపారు. అంతేకాక దేశంలో ఎక్కడా లేనివిధంగా తెలంగాణ రాష్ట్రంలో ఏడాదికి 13 వేల కోట్లు వెచ్చించి, రేషన్ షాప్ ల ద్వారా తెల్ల రేషన్ కార్డు ఉన్న లబ్ధిదారులకు సన్న బియ్యం ఇస్తున్నామని తెలియజేసారు. పదేళ్లలో బిఆర్ఎస్ చేయని అభివృద్ధిని, 1000 రోజుల్లో కాంగ్రెస్ పాలనలో చేసి చూపిస్తున్నామని అన్నారు. ఇప్పుడు గుడిసెలు ఉన్న వారిని గుర్తించి రెండో విడత ఇందిరమ్మ ఇండ్లు ఇస్తున్నామని, వచ్చే సంవత్సరం మార్చ్ లో మూడో విడత ఇందిరమ్మ ఇండ్లు ఇస్తామని తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వం మహిళల సాధికారతకు పెద్దపీట వేస్తుందని, రాష్ట్రంలోని కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా మార్చేందుకు విభిన్న పథకాలకు శ్రీకారం చుట్టి ముందుకెళ్తుంటే, మతిభ్రమించి అధికార దాహంతో కేటీఆర్ అడ్డగోలుగా మాట్లాడుతున్నారని కేటీఆర్ తీరుపై మండిపడ్డారు. పదేళ్ల బిఆర్ఎస్ పాలనలో బిఆర్ఎస్ నాయకులు పై నుండి కింది వరకు దోచుకోవడం, దాచుకోవడం తప్పా చేసిందేమీ లేదని, హైదరాబాద్ లో 3 ఫైవ్ స్టార్ హోటల్స్ కేటీఆర్ కు ఎలా వచ్చాయని ప్రశ్నించారు. బిఆర్ఎస్ నాయకులు రేపు వస్తాం, ఎల్లుండి వస్తామని కలలు కంటున్నారని, భవిష్యత్ లేని పార్టీ బిఆర్ఎస్ పార్టీ అని, 20 ఏళ్లయిన బిఆర్ఎస్ వచ్చేది లేదని అన్నారు, ఈ విషయాన్ని కేసీఆర్ కుమార్తె కవిత నే చెప్పిందని తెలిపారు. అదేవిధంగా నిన్న హరీష్ రావు చేసిన వ్యాఖ్యల పట్ల ఎమ్మెల్యే జిఎంఆర్ తీవ్ర స్థాయిలో స్పందించారు. కృష్ణా జలాలను ఆంధ్రప్రదేశ్‌కు దోచిపెట్టింది బిఆర్ఎస్ ప్రభుత్వమేనన్నారు, కృష్ణా నది జలాల విషయంలో తెలంగాణ ప్రయోజనాలను కాపాడటం లో అప్పటి బిఆర్ఎస్ ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. పదేళ్ల బిఆర్ఎస్ పాలనలో



## బతుకమ్మ వేడుకలకు పకడ్బందీ ఏర్పాట్లు - మంత్రి పొన్నం

**ఉమ్మడి కరీంనగర్ జిల్లా ప్రతినిధి, అక్టోబర్15(నమస్తే ఉదయం):**

హుస్నాబాద్ నియోజకవర్గ పరిధిలోని కరీంనగర్, హనుమకొండ, సిద్దిపేట జిల్లాల అధికారులతో రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సచివాలయం నుండి టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. గ్రామాల్లో బతుకమ్మ వేడుకలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయడంతో పాటు, అర్హులైన దివ్యాంగులు, వృద్ధులకు సహాయక పరికరాలు అందించేందుకు చేపట్టాల్సిన చర్యలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. గ్రామాల్లో బతుకమ్మ వేడుకలకు వచ్చే మహిళలు, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని అవసరమైన సౌకర్యాలు కల్పించాలని మంత్రి అధికారులను ఆదేశించారు. ప్రతి గ్రామంలో ఉపాధి హామీ పథకం (ఈజీఎస్) కింద బతుకమ్మ ఘాట్ల వద్ద శుభ్రత, మట్టి పనులు, ఇతర అవసరమైన ఏర్పాట్లు చేపట్టాలని సూచించారు. గ్రామ సర్పంచులు, ప్రజాప్రతినిధులు, గ్రామ పంచాయతీ కార్యదర్శులు, జీపీఓలు, మండల స్థాయి అధికారులు సమన్వయంతో పనిచేసి వేడుకలను విజయవంతం చేయాలని తెలిపారు. ఏర్పాట్ల విషయంలో ఎక్కడైనా ఇబ్బందులు తలెత్తితే సంబంధిత గ్రామ పంచాయతీ కార్యదర్శులే బాధ్యత వహించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు.

# కలెక్టరేట్‌లో ఘనంగా బతుకమ్మ సంబరాలు

### గౌరీమాతకు పూజలు నిర్వహించిన అదనపు కలెక్టర్ జిల్లా అధికారులు

**జోగులాంబ గద్వాల జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 15(నమస్తే ఉదయం):**

బతుకమ్మ పండుగను పురస్కరించుకుని గురువారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం (కలెక్టరేట్)లో వివిధ శాఖల ఆధ్వర్యంలో బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు. ఆయా శాఖల మహిళా ఉద్యోగినులు, వారి కుటుంబ సభ్యులతో కలిసి హాజరై ఈ ఉత్సవంలో భాగస్వాములయ్యారు. అదనపు కలెక్టర్ నర్సింగారావు తదితరులు ఈ వేడుకల్లో పాల్గొని గౌరీమాతకు, రంగురంగుల పూలతో ఆకట్టుకునే రీతిలో ముస్తాబు చేసిన బతుకమ్మలకు సాంప్రదాయబద్ధంగా పూజలు చేశారు. వివిధ శాఖల ఆధ్వర్యంలో ముఖ్యంగా రెవెన్యూ శాఖ వైద్య ఆరోగ్యశాఖ, జిల్లా సంక్షేమ శాఖలు అందంగా అలంకరించిన బతుకమ్మలు కనువిందు చేస్తూ, పూల పండుగ ప్రాధాన్యతను చాటాయి. బతుకమ్మ గేయాలను



ఆలపిస్తూ మహిళా ఉద్యోగులు, యువతులు, మహిళలు లయబద్ధంగా బతుకమ్మ ఆటలాడుతూ ఎంతో ఉత్సాహంగా సంబరాల్లో పాల్గొన్నారు. దాండియా, కోలాటాలతో బతుకమ్మ సంబురానికి వన్నె చేకూర్చారు. ఈ సందర్భంగా సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో సందడి వాతావరణం నెలకొంది. కార్యాలయ పనివేళలు ముగిసినప్పటికీ ఉద్యోగినులు ఎవరూ ఇళ్లకు వెళ్లకుండా ఎంతో హుషారుగా ఈ ఉత్సవంలో పాల్గొని బతుకమ్మ



వేడుక ఔన్నత్యాన్ని చాటారు. ఉత్తమ అలంకరణతో కూడిన బతుకమ్మలను ఎంపిక చేసి, బహుమతులు అందజేశారు. ఈ ఉత్సవాల్లో రెవెన్యూ సిబ్బంది, వివిధ శాఖల జిల్లా అధికారులు వారి సిబ్బంది, పెద్ద సంఖ్యలో మహిళా ఉద్యోగులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

# అయిజ పట్టణ అభివృద్ధికి రాజకీయాలకు అతీతంగా కృషి చేయాలి

## మున్సిపల్ చైర్మన్ సీఎం సురేష్

### వ్యాపారులను ఇబ్బందులకు గురిచేయడం సరికాదు.

### ప్రెస్‌మీట్‌లో పాల్గొన్న వైస్ చైర్మన్ మాల నరసింహులు

**గద్వాల జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 15(నమస్తే ఉదయం)**

అయిజ పట్టణ అభివృద్ధికి రాజకీయాలకు అతీతంగా కృషి చేయాలని మున్సిపల్ చైర్మన్ సీఎం సురేష్ అన్నారు. గురువారం బీఆర్ఎస్ పార్టీ ప్రెస్‌మీట్‌లో చైర్మన్, కౌన్సిలర్లు, పట్టణ అధ్యక్షులు, నాయకులు, వ్యాపారులు మాట్లాడుతూ...అయిజ పట్టణంలో ప్రశాంతమైన వాతావరణాన్ని నెలకొల్పడంతో పాటు, వివిధ గ్రామాల నుంచి వచ్చి ఇక్కడ వ్యాపారాలు నిర్వహిస్తున్న ప్రతి ఒక్కరికీ రాజకీయాలకు అతీతంగా సమాన అవకాశాలు కల్పించాలని అయిజ మున్సిపల్ చైర్మన్ సీఎం సురేష్ అన్నారు. పట్టణంలో వ్యాపారులు, ప్రజలు ఎలాంటి భయాందోళనలకు గురికాకుండా ప్రశాంతంగా జీవనం సాగించే పరిస్థితులు కల్పించడం ప్రజాప్రతినిధుల బాధ్యత అని పేర్కొన్నారు.

**వ్యాపారుల కష్టార్జితాన్ని గౌరవించాలి**

అయిజ పట్టణంలో అనేకమంది చిన్న, మధ్యతరహా వ్యాపారులు తమ జీవితకాల కష్టార్జితాన్ని పెట్టుబడిగా పెట్టి, లక్షలాది రూపాయలు అప్పులు తీసుకుని వ్యాపార సంస్థలను ఏర్పాటు చేసుకున్నారని సీఎం సురేష్ తెలిపారు. భవనాల నిర్మాణాలకు అనుమతులు మంజూరు చేయడం, నిబంధనలను అమలు చేయడం, ఉల్లంఘనలపై చర్యలు తీసుకోవడం సంబంధిత అధికారుల పరిధిలోని అంశాలని గుర్తుచేశారు.

కొన్ని భవనాలకు నివాస అవసరాల కోసం అనుమతులు ఉన్నప్పటికీ, ప్రస్తుతం వాటిలో వ్యాపారాలు నిర్వహిస్తున్న అంశాలు ఉన్నాయని, పలువురు వ్యాపారులు పెనాల్టీలు సహా వర్తించే పన్నులను చెల్లిస్తున్నారని తెలిపారు. ఇలాంటి అంశాలను సమగ్రంగా పరిశీలించి, నిబంధనల ప్రకారం పరిష్కార మార్గాలను అన్వేషించాలని కోరారు. నిబంధనల ఉల్లంఘనలు ఉన్నట్లయితే వాటిపై చట్టప్రకారం చర్యలు తీసుకోవడాన్ని ఎవరూ వ్యతిరేకించరని, అయితే చర్యలు తీసుకునే సమయంలో వివక్షకు తావులేకుండా, అందరికీ ఒకే విధమైన విధానాన్ని అనుసరించాలని అన్నారు. వ్యాపారులు తమ సమస్యలను పరిష్కరించుకునేందుకు అవసరమైన చట్టబద్ధమైన వెసులుబాటును కల్పించే దిశగా అధికారులు, ప్రజాప్రతినిధులు కలిసి పనిచేయాలని సూచించారు.

**150 కోట్ల కుంభకోణం ఆరోపణలపై వాస్తవాలు వెల్లడించాలి**

అయిజలో రూ.150 కోట్లకు పైగా కుంభకోణం జరిగిందంటూ చేస్తున్న ఆరోపణలపై సీఎం సురేష్ స్పందిస్తూ, ఇలాంటి తీవ్రమైన ఆరోపణలు చేసేటప్పుడు



వాటికి సంబంధించిన ఆధారాలను ప్రజల ముందు ఉంచాలని అన్నారు. భవనాల నిర్మాణాలకు అనుమతులు ఇచ్చే అధికారం ఎవరికి ఉంది? సంబంధిత అనుమతులు ఏ విధంగా మంజూరయ్యాయి? అనే అంశాలను అధికారిక రికార్డుల ఆధారంగా పరిశీలించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.లి

గతంలో నిర్మించిన భవనాల విషయంలో ప్రస్తుతం రాజకీయ వివాదాలు సృష్టించడం కంటే, వాస్తవాలను పరిశీలించి నిబంధనల ప్రకారం సమస్యలను పరిష్కరించడం ముఖ్యమని తెలిపారు. ఒకవేళ అక్రమాలు జరిగినట్లు ఆధారాలు ఉంటే సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసి చట్టబద్ధమైన చర్యలు కోరవచ్చని, ఆధారాలు లేకుండా ఆరోపణలు చేయడం వల్ల వ్యాపారులు, ప్రజల్లో అనవసరమైన ఆందోళన ఏర్పడుతుందని అన్నారు.

గతంలో ప్రశ్నించని అంశాలను ప్రస్తుతం రాజకీయ వివాదాలుగా మార్చి, కొంతమంది వ్యాపారులను లక్ష్యంగా చేసుకుని ఇబ్బందులకు గురిచేస్తున్నారనే భావన ప్రజల్లో కలగకుండా చూడాలని కోరారు.

**వ్యాపారులకు అండగా ఉంటాం**

మున్సిపల్ చైర్మన్‌గా అయిజ పట్టణంలోని వ్యాపారుల సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి, చట్టబద్ధమైన పరిష్కారాల కోసం కృషి చేస్తానని సీఎం సురేష్ గారు భరోసా ఇచ్చారు. వివిధ గ్రామాల నుంచి వచ్చి పెట్టుబడులు పెట్టిన వ్యాపారులు తమ వ్యాపారాలను ప్రశాంతంగా నిర్వహించుకునేలా అందరూ సహకరించాలని విజ్ఞప్తి చేశారు.పట్టణంలో రాజకీయ విభేదాలు ఉన్నప్పటికీ, అవి వ్యక్తిగత కక్షలకు, వ్యాపారులపై ఒత్తిడికి దారితీయకూడదని అన్నారు. ఎన్నికల సమయంలో రాజకీయాలు సహజమని, అయితే ఎన్నికల తర్వాత ప్రజాప్రతినిధులు, నాయకులు, ప్రజలు పరస్పర గౌరవంతో వ్యవహరిస్తూ పట్టణ అభివృద్ధి కోసం కలిసికట్టుగా పనిచేయాలని పిలుపునిచ్చారు.

**అభివృద్ధిపై దృష్టి పెట్టాలి: మాస్టర్ మధుకుమార్**

అయిజ పట్టణ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు మాస్టర్ మధుకుమార్ మాట్లాడుతూ, గత కొంతకాలంగా పట్టణంలో రాజకీయ ఉద్రిక్తతలకు దారితీసే పరిస్థితులు ఏర్పడుతున్నాయని అన్నారు. బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలను లక్ష్యంగా చేసుకుని వ్యాఖ్యలు చేయడం, రాజకీయ విభేదాలను వ్యక్తిగత వివాదాలుగా మార్చడం సరికాదని పేర్కొన్నారు.

రాజకీయ నాయకులు బహిరంగ ప్రదేశాల్లో మాట్లాడేటప్పుడు సంయమనం పాటించాలని, వ్యక్తిగత దూషణలు, బెదిరింపులకు తావివ్వకూడదని సూచించారు. టీ దుకాణాలు వంటి బహిరంగ ప్రదేశాల్లో వివిధ పార్టీలకు చెందిన వ్యక్తులు కలుసుకోవడం సహజమని, అలాంటి సందర్భాల్లో పరస్పర గౌరవంతో వ్యవహరించాలని అన్నారు.

ఎంపీ మల్లు రవి, మంత్రి జూపల్లి కృష్ణారావు వంటి ప్రజాప్రతినిధుల పేర్లను రాజకీయ వివాదాల్లోకి లాగకుండా, వ్యాపారుల సమస్యలను చట్టబద్ధంగా పరిష్కరించేందుకు కృషి చేయాలని కోరారు. ప్రజాప్రతినిధులు తమ పరిధిలోని ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని అన్నారు.

ప్రజాప్రతినిధులు తమ వార్డుల్లో ప్రజల సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారం కోసం ముందుకు వస్తేనే ప్రజల్లో విశ్వాసం పెరుగుతుందని అన్నారు. రాజకీయ విమర్శలు, వ్యక్తిగత ఆరోపణలకే పరిమితం కాకుండా, అభివృద్ధి పనుల్లో పోటీపడాలని సూచించారు.

**వ్యాపారులకు వెసులుబాటు కల్పించేందుకు సహకరించాలి: నాగన్న గౌడ్**

ఈ సందర్భంగా కో-ఆప్షన్ సభ్యులు నాగన్న గౌడ్ మాట్లాడుతూ, పట్టణంలోని వ్యాపార సంస్థలకు సంబంధించిన సమస్యలను పరస్పర చర్చల ద్వారా పరిష్కరించుకోవాలని కోరినట్లు సమావేశంలో పేర్కొన్నారు. భవనాల అనుమతులు, పన్నుల చెల్లింపులు, వ్యాపార నిర్వహణకు సంబంధించిన అంశాలపై వాస్తవాలను పరిశీలించి, చట్టబద్ధమైన పరిష్కార మార్గాలను అన్వేషించాలని సూచించారు.వ్యాపారులను లక్ష్యంగా చేసుకుని ఆరోపణలు చేయడం, వారి జీవనోపాధికి ఇబ్బందులు కలిగించే పరిస్థితులు ఏర్పడటం మంచిది కాదని పేర్కొన్నారు. వ్యాపారులకు అవసరమైన వెసులుబాటును కల్పించే దిశగా సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు సహకరించాలని కోరారు.రాజకీయ విభేదాలను పక్కనపెట్టి పట్టణంలోని వ్యాపార సంస్థల అభివృద్ధికి, ప్రజల సంక్షేమానికి ప్రాధాన్యత ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

**వ్యాపారుల సమస్యలను పరిష్కరించేందుకు సమిష్టి కృషి అవసరం**

సమావేశంలో నాయకులు, వ్యాపారులు మాట్లాడుతూ, అయిజ పట్టణంలో ప్రశాంతమైన వాతావరణం నెలకొనడం అందరికీ అవసరమని పేర్కొన్నారు.ఈ సమావేశంలో కౌన్సిలర్లు మహేశ్వరి , అశ్వ సరోజమ్మ , పద్మమ్మ , నర్సమ్మ , రజాక్ , తిరుమలేష్ , ఏ. శివ , డా. కృష్ణ , కో-ఆప్షన్ సభ్యులు నాగన్న గౌడ్ , శంషాద్ బేగం , బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు ఎక్లసుపురం నరసింహా రెడ్డి , మున్సిపల్ మాజీ చైర్మన్ దేవన్న , వెంకన్న గౌడ్ , మహిళా నాయకురాలు రంగు సుమలత , రఘు , పెద్దయ్య , కుమ్మరి బుడ్డన్న , అంజి బాబు , అశోక్ , చరణ్ రెడ్డి , వెంకటేష్ , లాల్ భాష , మద్దిలేటి , లెనిన్, సలీం , రాంరెడ్డి , వెంకట్రాములు , నాగరాజు , నసీర్ , టప్ప బాబు తదితరులు పాల్గొన్నారు.



# ఎల్‌నినో నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలి- జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా

**ఉమ్మడి కరీంనగర్ జిల్లా ప్రతినిధి, అక్టోబర్15(నమస్తే ఉదయం):**

ఎల్‌నినో నేపథ్యంలో తలెత్తే పరిస్థితులను ఎదుర్కొనేందుకు అన్ని శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా ఆదేశించారు. తాగునీటి సరఫరాకు ఎక్కడా ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యేక దృష్టి సారించాలని, విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. సమస్యలు తలెత్తిన తర్వాత స్పందించడం కాకుండా, సమస్యలు ఏర్పడే అవకాశమున్న ప్రాంతాలను ముందుగానే గుర్తించి పరిష్కార మార్గాలను సిద్ధం చేసుకోవాలని స్పష్టం చేశారు.గురువారం ఐడీఓసీలోని కలెక్టర్ ఛాంబర్‌లో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) డి. శ్రీనివాస్ రెడ్డితో కలిసి జిల్లా స్థాయి అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఎల్‌నినో నేపథ్యంలో జిల్లాలో చేపట్టాల్సిన ముందస్తు చర్యలు, వివిధ శాఖల సన్నద్ధతపై చర్చించారు. ఇరిగేషన్, విద్యుత్, వ్యవసాయ, భూగర్భజల శాఖలతో పాటు ఇతర శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు.



# దుర్గామాత అమ్మవారి పల్లకి ఊరేగింపు కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా గణేష్

**కూకట్ పల్లి, అక్టోబర్ 15 (నమస్తే)**

శేరిలింగంపల్లి నియోజకవర్గం, ఉమ్మడి ఆల్విన్ కాలనీ డివిజన్ పరిదిలో దత్తాత్రేయ కాలనీలో టీం దేవీ నవరాత్రి ఆధ్వర్యంలో నిర్వహించినటువంటి దేవి నవరాత్రుల సందర్భంగా వారి ఆహ్వాన మేరకు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జిల్లా గణేష్ పూజా కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పల్లకి ఊరేగింపు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా గణేష్ నేత మాట్లాడుతూ ఆల్విన్ డివిజన్ పరిధిలోని దుర్గామాత మండపాల్లో నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహించడం, పల్లకి ఊరేగింపు కార్యక్రమం నిర్వహించడం, ఈ కార్యక్రమంలో కాలనీలోని మహిళలు, కాలనీ పెద్దలు, యువకులు అధిక సంఖ్యలో పాల్గొనడం సనాతన ధర్మానికి ఇదొక మంచి పరిణామం అని అన్నారు. అమ్మవారిని దర్శనానికి ఆహ్వానించిన కాలనీ పెద్దలకు ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమములో కాలనీ అధ్యక్షులు నాగభూషణం, యాదగిరి, వీరేశం, అరుణ్, వికాస్, రాజు, రవి, సాయి, మహేష్ తదితరులు పాల్గొన్నారు.



# బీజేపీ నేతలు రాధే శ్యామ్, కాంచి శివలకు అభినందనలు

### పార్టీ బలోపేతానికి, ప్రజాసేవకు అంకితభావంతో కృషి చేయాలి

**కూకట్ పల్లి, అక్టోబర్ 15 (నమస్తే ఉదయం)**

భారతీయ జనతా పార్టీ ఫతేనగర్ డివిజన్ అధ్యక్షుడిగా రాధే శ్యామ్, కూకట్‌పల్లి శాసనసభ నియోజకవర్గ ఇతర వెనుకబడిన తరగతుల మోర్చా సహ కన్వీనర్‌గా కాంచి శివ బాధ్యతలు నిర్వహిస్తున్న నేపథ్యంలో పార్టీ అగ్రనేతలు వారికి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా మల్కాజ్‌గిరి పార్లమెంటు సభ్యుడు ఈటల రాజేందర్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు గిరివర్ధన్, జిల్లా ఇతర వెనుకబడిన తరగతుల మోర్చా అధ్యక్షుడు శేఖర్ యాదవ్, పార్టీ సీనియర్ నాయకుడు కాంచి మహేందర్ సమక్షంలో రాధే శ్యామ్, కాంచి శివలకు శుభాకాంక్షలు తెలిపారు. నూతన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని నాయకులు సూచించారు. క్షేత్రస్థాయిలో కార్యకర్తలను సమన్వయం చేసుకుంటూ పార్టీని మరింత బలోపేతం చేయడంతోపాటు ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేయాలని ఆకాంక్షించారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ పార్టీకి మంచి పేరు తీసుకురావాలని, భవిష్యత్తులో మరిన్ని ఉన్నత బాధ్యతలు చేపట్టి విజయాలు సాధించాలని వారు అభిలాషించారు.

# పార్చర్ల స్టేజ్ సమీపంలో ఆటో బోల్తా.. మహిళ దుర్మరణం

**జోగులాంబ గద్వాల జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 15(నమస్తే ఉదయం):**



ధరూర్ మండలం పార్చర్ల స్టేజ్ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక మహిళ ప్రాణాలు కోల్పోగా, ముగ్గురు గాయపడారు. ధరూర్ మండలం గూడెందొడ్డి గ్రామానికి చెందిన కే.వెంకటేష్ కుటుంబ సభ్యులందరూ కలిసి గురువారం మధ్యాహ్నం ఆటోలో గద్వాలకు బయలుదేరారు. మార్గమధ్యలో పార్చర్ల స్టేజ్ గోనుపాడు మధ్య(రైస్ మిల్లు) ప్రమాదవశాత్తు ఆటో అదుపుతప్పి బోల్తా పడింది.ఈ ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న పావని (28) అనే మహిళా సంఘటన స్థలంలోనే మృతి చెందింది. ఈ ఘటనలో ముగ్గురు గాయపడారు. గాయపడిన వారిని చికిత్స కోసం గద్వాల జిల్లా ఆసుపత్రికి తరలించారు. కాగ మృతురాలి మూడేండ్ల కూతురు గాయపడటంతో మెరుగైన వైద్యం కోసం కర్నూల్ జిల్లా ఆసుపత్రికి తరలించారు.



# అక్రమంగా అమర్చిన 12 మోటార్లు స్వాధీనం

### కూకట్‌పల్లి జోన్‌లో జలమండలి విజిలెన్స్ అధికారుల తనిఖీలు

**కూకట్ పల్లి, అక్టోబర్ 15(నమస్తే ఉదయం)**

తాగునీటి సరఫరా పైపులైన్లకు అక్రమంగా మోటార్లు బిగించి నీటిని తోడుకుంటున్న వారిపై జలమండలి విజిలెన్స్ అధికారులు చర్యలు చేపట్టారు. గురువారం కూకట్‌పల్లి జోన్ పరిధిలోని డివిజన్-22, గాయత్రీనగర్ వార్డులోని వివేకానందనగర్ కాలనీలో ప్రత్యేక తనిఖీలు నిర్వహించి 12 అక్రమ మోటార్లను స్వాధీనం చేసుకున్నారు.ఉదయం 8 గంటల నుంచి 10 గంటల వరకు జలమండలి విజిలెన్స్ బృందం సంబంధిత మేనేజర్‌తో కలిసి ఈ తనిఖీలు చేపట్టింది. తాగునీటి సరఫరా పైపులైన్లకు అక్రమంగా అమర్చిన మోటార్లను గుర్తించి తొలగించారు.తాగునీటి పైపులైన్లకు నేరుగా మోటార్లు బిగించి నీటిని తోడుకోవడం వల్ల ఇతర వినియోగదారులకు సరిపడా నీరు అందకపోవడంతో పాటు సరఫరా ప్రెషర్ తగ్గే అవకాశం ఉందని జలమండలి పేర్కొంది. అక్రమ మోటార్ల వినియోగాన్ని అరికట్టేందుకు తనిఖీలు కొనసాగుతాయని, నిబంధనలు ఉల్లంఘించే వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది.

# అర్హులైన ప్రతి పేదవాడికి ప్రభుత్వం రేషన్ కార్డు: ఎమ్మెల్యే జిఎంఆర్

**మొదటి పేజీ తరువాయి...**

పాలమూరు--రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని పూర్తి చేసి ఉంటే నేడు పాలమూరు జిల్లా కు ఈ దుస్థితి వచ్చేది కాదని ఎమ్మెల్యే జియంఆర్ పేర్కొన్నారు.నాడు సాగునీటి శాఖ మంత్రిగా బాధ్యతలు నిర్వహించిన హరీశ్‌రావు పాలమూరు ప్రాంత ప్రయోజనాలను ఎమ్మెల్యే జియంఆర్ పట్టించుకోవటం లేదన్నారు. మండిపడ్డారు.పాలమూరు--రంగారెడ్డి ప్రాజెక్టును పూర్తి చేయాలని అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్‌పై ఒత్తిడి తీసుకురావడంలో పాలమూరు మాజీ ఎమ్మెల్యేలు, మంత్రులు విఫలమయ్యారని విమర్శించారు.నిరంతరం ప్రజా సంక్షేమం, మహిళా సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి అండగా ఉండి, మరోసారి ఆశీర్వదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి సభ్యులు రావుల జితేంద్రనాథ్ రెడ్డి, ప్రజా ప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

# వరంగల్ హాస్పిటల్‌లో దసరా నుంచి సాఫ్ట్ లాంచ్ ఓపీ సేవలు

**మొదటి పేజీ తరువాయి...**

ఈ ఆసుపత్రిని ప్రజాప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకొని, నిధులు కేటాయించి యుద్ధ ప్రాతిపదికన పనులు చేయించడం జరిగింది. నిరంతర పర్యవేక్షణ వలన పనులు కూడా తుదిదశకు చేరుకున్నాయి. నిర్మాణ పనులు తుది దశకు చేరుకుని చిన్న చిన్న పనులు మినహా సేవలకు సిద్దంగా ఉన్నఈ ఆసుపత్రిని ఈ అక్టోబర్ 20 తేది అంటే దసరా రోజున సాఫ్ట్ లాంచ్ ద్వారా ఓపి సేవలను ప్రారంభించబోతున్నందుకు చాలా సంతోషంగా ఉంది. దీనికి సంబంధించిన అన్ని ఏర్పాట్లు పూర్తికావొచ్చాయి. గత ప్రభుత్వం కేవలం కాగితాల మీదనే ఆర్డర్ల ఇచ్చి వైద్యాన్ని పూర్తి నిర్లక్ష్యం చేసింది. ప్రజా ప్రభుత్వం వచ్చాక ఎలాంటి బేషజాలకు పోకుండా ప్రజలకు ఉపయోగపడే ప్రతి కార్యక్రమాన్ని పూర్తి చేసుకుంటూ పోతుంది. ఈ ఆసుపత్రి అందుబాటులోకి వస్తే సుమారు 5000 వరకు వచ్చే ఉండే అవకాశం ఉంది. వరంగల్ పట్టణ ప్రజలు, పరిసర ప్రాంతాల ప్రజలకు రాబోయే రోజుల్లో ఈ ఎంజీఎం ఆసుపత్రి ద్వారా అత్యంత అధునాతనమైన కార్పొరేట్ స్థాయి వైద్యం అందుతుంది. డిసెంబర్ నాటికి పూర్తి స్థాయిలో అందుబాటులోకి వస్తుంది.

# గగన్‌పహాడ్ మామిడికుంట చెరువును పరిరక్షించాలి

### కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలి: బిజెపి నాయకులు వినయ్ రెడ్డి

### పైపుల పనులతో సహజ నీటి ప్రవాహానికి ఆటంకం కలుగుతోందా.?

**రాజేంద్రనగర్,అక్టోబర్15(నమస్తే ఉదయం)**

గగన్‌పహాడ్ ప్రాంతంలోని మామిడికుంట చెరువుకు నీరు చేరే ప్రధాన ఇన్‌లెట్ నాలా ప్రస్తుతం కనిపించని పరిస్థితి నెలకొందని,అక్కడ కొనసాగుతున్న పైపుల పనులపై సమగ్ర విచారణ చేపట్టి వాస్తవాలను ప్రజలకు వెల్లడించాలని బీజేపీ మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ అధ్యక్షుడు సూరెడ్డి వినయ్ రెడ్డి సంబంధిత అధికారులను డిమాండ్ చేశారు.చెరువులోకి వర్షపు నీరు చేరేందుకు ప్రధాన మార్గంగా స్థానికులు పేర్కొంటున్న నాలా వద్ద పైపుల పనులు జరుగుతున్నట్లు కనిపిస్తోందని,ఈ నేపథ్యంలో నాలా సహజ ప్రవాహ మార్గం ఎక్కడికి వెళ్లిందని,చెరువులోకి నీరు చేరే మార్గాన్ని యథాతథంగా ఉ ంచుతున్నారా అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయని పేర్కొన్నారు .క్షేత్రస్థాయిలో కనిపిస్తున్న పరిస్థితులపై ఇంజినీరింగ్,రెవెన్యూ, చెరువుల పరిరక్షణశాఖల అధికారులు సంయుక్తంగా





పరిశీలన జరిపి స్పష్టత ఇవ్వాలని కోరారు.పైపుల పనులకు సంబంధించిన అనుమతులు,పనుల స్వరూపం,నాలా అసలు హద్దులు,చెరువుకు నీరు చేరే మార్గం వివరాలను బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు.నాలా ప్రాంతంలో నీరు నిలిచివుండటంతో పాటు మట్టి కుప్పలు,నిర్మాణ వ్యర్థాలు



కనిపిస్తున్నాయని,వీటి వల్ల నీటి ప్రవాహానికి ఆటంకం కలుగుతోందా లేదా అన్నది సాంకేతికంగా నిర్ధారించాలని అన్నారు. మామిడికుంట చెరువుకు నీరు చేరే ప్రధాన నాలా హద్దులను తక్షణమే సర్వే చేయాలని,పైపుల పనులకు సంబంధించిన అనుమతులు, డిజైన్,ఇతర వివరాలను వెల్లడించాలని,సహజ నీటి ప్రవాహానికి అడ్డంకులు ఏర్పడినట్లు తేలితే మట్టి,నిర్మాణ వ్యర్థాలను తొలగించాలని కోరారు.చెరువు ఇన్‌లెట్ మార్గాన్ని పరిరక్షించి భవిష్యత్తులో ఆక్రమణలు లేదా నీటి ప్రవాహానికి ఆటంకాలు కలగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు.ఈ సందర్భంగా సూరెడ్డి వినయ్ రెడ్డి మాట్లాడుతూ...మామిడికుంట చెరువు ప్రజల సహజ సంపద అని,చెరువులోకి నీరు చేరే ప్రధాన నాలా కనిపించని పరిస్థితి ఎందుకు ఏర్పడిందో అధికారులు వివరించాలని అన్నారు.అక్కడ జరుగుతున్న పైపుల పనులకు ఎలాంటి అనుమతులు ఉన్నాయి,సహజ నీటి ప్రవాహ మార్గం సురక్షితంగా ఉందా అనే అంశాలపై స్పష్టమైన సమాధానం ఇవ్వాలని కోరారు.వాస్తవాలను ప్రజలకు తెలియజేస్తూ చెరువు,నాలా పరిరక్షణకు సంబంధిత శాఖలు తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



## లక్ష్మిగూడలో అమ్మవారి పూజల్లో పాల్గొన్న టీడీపీ సీనియర్ నాయకులు యు.విజయ్ కుమార్

**రాజేంద్రనగర్,అక్టోబర్15(నమస్తే ఉదయం)**

మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ పరిధిలోని లక్ష్మిగూడ బృందావన్ కాలనీలో శ్రీలలితా త్రిపుర సుందరి దేవి,అలిగిన బతుకమ్మ అమ్మవార్ల పూజా కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు యు.విజయ్ కుమార్ పాల్గొని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.బస్తీ నాయకురాలు మాలతి అక్కతో పాటు స్థానిక నాయకులు,కాలనీ వాసులు పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.ఈ సందర్భంగా బృందావన్ కాలనీలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు త్వరగా పరిష్కారం కావాలని భక్తులు అమ్మవారిని ప్రార్థించారు.సంబంధిత అధికారులు కాలనీలోని సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించి,ప్రజల ఇబ్బందులను తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు.ప్రజా సమస్యలను సత్వరమే పరిష్కరించేలా అధికారులకు అమ్మవారు సద్బుద్ధిని ప్రసాదించాలని ఆకాంక్షించారు.అమ్మవారి ఆశీస్సులతో మైలార్‌దేవ్‌పల్లి డివిజన్‌లోని అన్ని కాలనీలు అభివృద్ధి చెందాలని,ప్రజలందరికీ సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలు కలగాలని ప్రార్థించారు.ఈ కార్యక్రమంలో ప్రసాద్, ఆనంద్,సురేందర్ కుమార్,రాహుల్, విక్కి,సిద్ధు,నాగేష్,శివ,ధనరాజ్, అఖిలేష్, సందీప్, వరుణ్,నాగరాజ్ తదితరులు పాల్గొన్నారు.



## లక్ష్మీగూడ వాంబేకాలనీ,ఆర్‌జీకేలో వైభవంగా దుర్గామాత నవరాత్రి వేడుకలు..

### అమ్మవారికి ప్రత్యేక పూజలు..భక్తులకు బీఆర్ఎస్ నాయకుల అన్నదానం..

**రాజేంద్రనగర్,అక్టోబర్15 (నమస్తే ఉదయం)**

రాజేంద్రనగర్ నియోజకవర్గం మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ పరిధిలోని వాంబేకాలనీ,ఆర్‌జీకే ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన శ్రీదుర్గామాత అమ్మవారి మండపాలను బీఆర్ఎస్ నాయకులు సందర్శించారు.ఈ సందర్భంగా అమ్మవారికి భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించి లోక కల్యాణం,ప్రజల సుఖసంతోషాలు,ఆయురారోగ్యాలు కలగాలని ప్రార్థించారు.నవరాత్రి ఉ త్సవాల సందర్భంగా ఆయా ప్రాంతాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.పూజా కార్యక్రమాల అనంతరం నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు ఉత్సాహంగా పాల్గొన్నారు.భక్తులకు స్వయంగా అన్నదానం చేసి సేవా కార్యక్రమంలో భాగస్వాములయ్యారు.పండుగలు,ఆధ్యాత్మిక కార్యక్రమాలు ప్రజల మధ్య ఐక్యతను,సోదరభావాన్ని పెంపొందిస్తాయని ఈ సందర్భంగా నాయకులు పేర్కొన్నారు.అమ్మవారి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు కోలన్ సుభాష్ రెడ్డి,కాటేదాన్ డివిజన్ అధ్యక్షుడు ఎస్.వెంకటేష్,మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ అధ్యక్షుడు గుమ్మడి కుమార్,సీనియర్ నాయకుడు రమేష్ ముదిరాజ్,లు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు.వీరితో పాటు రామస్వామి,సునీల్,అశోక్ కుమార్,మధు చారి,బొంబాయి రవి,రిషి,లక్ష్మణ్,ప్రవీణ్,నరేష్ తదితర పార్టీ నాయకులు, కార్యకర్తలు,స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.





## దుర్గామాత ఆశీస్సులతో ప్రజలు సుభిక్షంగా ఉండాలి: ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్

### మార్కండేయనగర్ శరన్నవరాత్రి ఉత్సవాలలో ఎమ్మెల్యే టి. ప్రకాష్ గౌడ్

**రాజేంద్రనగర్ , అక్టోబర్ 15 (నమస్తే ఉదయం)**

శరన్నవరాత్రి ఉత్సవాల పూజలందుకుం టున్న ఆ లోకమాత రాజేంద్రనగర్ నియోజకవర్గంలోని సమస్త ప్రజానీకాన్ని సుభిక్షంగా చూడాలని కోరుకున్నట్లు స్థానిక ఎమ్మెల్యే టి. ప్రకాష్ గౌడ్ తెలిపారు. ప్రతి రోజు విశిష్ట రూపాలలో పూజలు అందుకుంటున్న ఆ జగన్మాత భక్తులను తప్పకుండా చల్లగా కాపాడుతుందని ఆయన చెప్పారు. గురువారం రాత్రి మార్కండేయనగర్ లో స్థానిక బస్తీ వెల్ఫేర్ అసోసియేషన్, నవోధయ యూత్ సంయుక్తంగా నిర్వహిస్తున్న దేవి నవరాత్రి ఉత్సవాలలో ఆయన ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. శ్రీనివాస్ పంతులు మంత్రోత్సరనల నడుమ శ్రీ లలితా త్రిపుర సుందరీ దేవికి ప్రత్యేక పూజలు చేసి, మహా మంగళ నీరాజనం సమర్పించారు. అనంతరం అన్నప్రసాద కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ స్వయంగా వడ్డన చేసి



ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన బస్తీ పెద్దలు గద్దె క్రిష్ణ, ఏర్వ సత్యనారాయణ, పగిడిమర్రి సూర్య నారాయణ, విడెం రమేష్ తదితరులతో కలసి మాట్లాడుతూ మార్కండేయనగర్ కాలనీ వాసులు భక్తి పరులని, ప్రతి దైవ కార్యాన్ని ఉత్సవాల రూపంలో నిర్వహిస్తూ ఐక్యతను చాటుతున్నారన్నారు. దేవి మాలాధారణ చేసిన భక్తలు నిత్యం చేసే పూజలు బస్తీలోని ప్రజలందరికి ఆ దుర్గామాత రక్షణ కవచాన్ని అందించనున్నాయన్నారు. పేదలకు అన్నప్రసాదం తీసుకోవడం అమ్మవారు స్వీకరించిన ఫలితాన్నిస్తుందని చెబుతూ నిర్వాహకులను అభినందించారు. ఈ కార్యక్రమంలో బస్తీ కమిటీ ప్రధాన కార్యదర్శి కోట శ్యామ్ కుమార్, ఉపాధ్యక్షుడు శిరందాసు నరేందర్, తిరునగ లక్ష్మణ్, నవోధయ యూత్ అధ్యక్షుడు కోట పవన్ కుమార్, మైలార్ దేవ్ పల్లి డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఎన్. ధనంజయ్, సీనియర్ నాయకులు సరికొండ వెంకటేష్, మామిడిశెట్టి శ్రీనివాస్, బాస శ్రీనివాస్, కళ్లెం లక్ష్మారెడ్డి, మహేష్ గౌడ్. శేఖర్ ,జగదీష్ , నవోధయ యూత్ ప్రతినిధులు జి. మల్లేష్, శిరందాసు ప్రభాకర్, కుమ్మరి నరేష్, మూశం నరేష్, చింట్టు రెడ్డి, గంజి విజయ్ కుమార్, పి.భాస్కర్, బాత్కు అజయ్ యాదవ్, బాలాజీ, గుర్రం వాసు, గంట వెంకట్, మహేష్, రాజు, సాయి కిరణ్, శివ, మహిళా భక్తులు గద్దె పద్మ,పగిడిమర్రి ఉమాదేవి, గంజి ధనలక్ష్మి, అవ్వారి సావిత్రి, గద్దె భాగ్యరేఖ తదితరులు పాల్గొన్నారు.



## 121వ డివిజన్‌లో రూ.2.1కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే

**రాజేంద్రనగర్,అక్టోబర్15(నమస్తే ఉదయం)**

రాజేంద్రనగర్ నియోజకవర్గంలోని 121వ డివిజన్ పరిధిలోని పీఅండ్ టీకాలనీ ఏబ్లాక్,సీబ్లాక్‌లలో రూ. 2. 1కోట్ల నిధులతో చేపట్టనున్న అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ,సీసీ రోడ్ల నిర్మాణ పనులకు ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ శంకుస్థాపన చేశారు.కాలనీలో మౌలిక సదుపాయాల కల్పనలో భాగంగా ఈ పనులను చేపట్టారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... రాజేంద్రనగర్ నియోజకవర్గం రూపు రేఖలను మార్చేలా అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామని,రానున్న రోజుల్లో మరిన్ని పనులు చేపట్టి మౌలిక వసతులను మెరుగుపరుస్తామని పేర్కొన్నారుప్రజల అవసరాలను దృష్టిలో ఉ ంచుకుని రోడ్లు, డ్రైనేజీ,మురుగునీటి పారుదల వ్యవస్థల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు.ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేరుస్తూ,నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు నిరంతరం కృషి చేస్తామని తెలిపారు.ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తించి,సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకుంటూ అవసరమైన అభివృద్ధి పనులను దశలవారీగా చేపడతామని ఎమ్మెల్యే స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో మహేందర్ గౌడ్,కృష్ణారెడ్డి,రామ్ దాసు,నదీమ్,సుమన్ గౌడ్,రాజు యాదవ్,మాజీ కార్పొరేటర్ పద్మావతి పాపయ్యయాదవ్‌తో పాటు కాలనీ వాసులు పాల్గొన్నారు.



## ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల సమ్మెకు తోకల శ్రీనివాస్ రెడ్డి సంఘీభావం..

### ఉద్యోగులను రెగ్యులర్ చేయాలి..పెండింగ్ బకాయిలు వెంటనే విడుదల చేయాలి

**రాజేంద్రనగర్,అక్టోబర్15(నమస్తే ఉదయం)**

తెలంగాణ రాష్ట్రంలో ఎన్‌హెచ్‌ఎం జేఏసీ ఆధ్వర్యంలో వైద్య ఆరోగ్యశాఖ ఉద్యోగులు చేపట్టిన నిరవధిక సమ్మెకు బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు,రాజేంద్రనగర్ నియోజకవర్గ కాంటెస్టెడ్ ఎమ్మెల్యే తోకల శ్రీనివాస్ రెడ్డి సంఘీభావం ప్రకటించారు.రంగారెడ్డి,మేడ్చల్, మల్కాజిగిరి,హైదరాబాద్,సంగారెడ్డి జిల్లాలకు చెందిన ఉద్యోగులకు మద్దతుగా శంషాబాద్‌లో నిర్వహించిన సమ్మె కార్యక్రమంలో పాల్గొని తమ సంపూర్ణ మద్దతు తెలిపారు.ఈ సందర్భంగా తోకల శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ...ప్రజల ఆరోగ్య పరిరక్షణ కోసం నిరంతరం కష్టపడుతున్న నేషనల్ హెల్త్ మిషన్ (ఎన్‌హెచ్‌ఎం)ఉద్యోగుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు.వైద్య ఆరోగ్యశాఖలో కీలక పాత్ర పోషిస్తున్న ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించడంతో పాటు వారి న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు.ఎన్‌హెచ్‌ఎం ఉ ద్యోగులను వెంటనే రెగ్యులర్ చేయాలని,జీవో 60,1195ప్రకారం పెరిగిన వేతనాలను అమలు చేయాలని కోరారు.2022నుంచి పెండింగ్‌లో ఉన్న 5 శాతం వార్షిక ఇంక్రిమెంట్,8శాతం లయబిలిటీ బోనస్‌ను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.మహిళా ఉద్యోగులకు వేతనంతో కూడిన 180రోజుల ప్రసూతి సెలవులు మంజూరు చేయడంతో పాటు ఉద్యోగుల భవిష్యత్తుకు భరోసా కల్పించాలని,సమాన పనికి సమాన వేతనం సూత్రాన్ని అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడంలో ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల పాత్ర ఎంతో కీలకమని,అలాంటి ఉద్యోగులు తమ న్యాయమైన హక్కుల సాధన కోసం సమ్మె చేయాల్సిన పరిస్థితి రావడం విచారకరమని అన్నారు.ప్రభుత్వం నిర్లక్ష్యాన్ని వీడి ఎన్‌హెచ్‌ఎం జేఏసీ ప్రతినిధులతో చర్చలు జరిపి ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో డాక్టర్ సంగీత,డాక్టర్ దినేష్,డాక్టర్ శంకర్,డాక్టర్ సాయి కిరణ్,డాక్టర్ చేతన్,డాక్టర్ అనూప్,డీహెచ్ఓ డాక్టర్ రాము నాయక్,గిరిజన సంఘం అధ్యక్షుడు,డాక్టర్ అమిత్,స్థానిక నాయకులు బత్కు శ్రీనివాస్ యాదవ్,శంకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.




# మహిళా రైతుల ఆరోగ్యం,సాధికారతకు ప్రాధాన్యం ఇవ్వాలి

### రాజేంద్రనగర్ లోని నార్మ్‌లో మహిళా రైతు దినోత్సవ వేడుకలు..ఆధునిక వ్యవసాయ సాంకేతికతను వినియోగించుకోవాలని నిపుణుల సూచన

**రాజేంద్రనగర్,అక్టోబర్15(నమస్తే ఉదయం )**

ఐక్యరాజ్యసమితి 2026సంవత్సరాన్ని అంతర్జాతీయ మహిళా రైతు సంవత్సరంగా ప్రకటించిన నేపథ్యంలో రాజేంద్రనగర్ లోని జాతీయ వ్యవసాయ పరిశోధన నిర్వహణ అకాడమీ (ఐసీఏఆర్--ఎన్ఏఏఆర్ఎమ్)లో గురువారం మహిళా రైతు దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో మహిళా రైతుల విజయగాథలు,అనుభవాల పంచుకోవడంతో పాటు వర్మీ కంపోస్ట్ తయారీపై ప్రత్యక్ష ప్రదర్శన,వ్యవసాయంలో మహిళల సామాజిక,ఆర్థిక సాధికారతపై నిపుణుల ప్రసంగాలు నిర్వహించారు.

**వ్యవసాయ పనుల్లో ఆరోగ్యభద్రత ముఖ్యం..**

ఎన్ఐఆర్డీపీఆర్ మాజీ ప్రొఫెసర్ డాక్టర్ సీహెచ్. రాధికరాణి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ...మహిళా రైతులు వ్యవసాయ పనులు నిర్వహించేటప్పుడు తమ ఆరోగ్యానికి ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. పురుగు మందులు, కలుపుమందులు, రసాయనాలు పిచికారీ చేసే సమయంలో మాస్కులు,చేతి తొడుగులు,ఇతర రక్షణ పరికరాలు ధరించాలని,వృత్తిపరమైన ప్రమాదాల నుంచి తమను తాము కాపాడుకోవాలని తెలిపారు.తెలుగు రాష్ట్రాల్లో మహిళల సాధికారతకు స్వయం సహాయక సంఘాలు కీలక వేదికలుగా నిలుస్తున్నాయని పేర్కొన్నారు.




**ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకోవాలి..**

ఐసీఏఆర్--ఎన్ఏఏఆర్ఎమ్ సంయుక్త సంచాలకులు డాక్టర్ గోపాల్ లాల్ మాట్లాడుతూ...వ్యవసాయ పనుల్లో శ్రమను తగ్గించి,పనితీరును మెరుగుపరిచేందుకు డ్రోన్లు,ఆధునిక వ్యవసాయ యంత్రాలు వంటి సాంకేతిక పరిజ్ఞానాన్ని మహిళా రైతులు వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు.దేశ వ్యవసాయ రంగానికి మహిళా రైతులు అందిస్తున్న సేవలు ఎంతో విలువైనవని పేర్కొంటూ వారి కృషిని అభినందించారు.

**70ఎకరాల్లో సేంద్రియ వ్యవసాయం..**

నాగర్‌కర్నూలు జిల్లా తెలకపల్లి గ్రామానికి చెందిన ఐసీఏ ఆర్ ఉత్తమ మహిళా రైతు పురస్కార గ్రహీత లావణ్య తన వ్యవసాయ ప్రయాణాన్ని వివరించారు.అనేక సవాళ్లను అధిగమించి 70 ఎకరాల్లో సాగు చేస్తున్నట్లు తెలిపారు.సేంద్రియ, బహుళ పంటల సాగుతో పాటు కుంకుమపువ్వు వరి సాగులో తాను అనుసరిస్తున్న పద్ధతులను వివరించారు.విత్తనాల ఎంపిక నుంచి పంటల మార్కెటింగ్ వరకు మొత్తం ప్రక్రియను



నిర్వహిస్తున్న విధానాన్ని పంచుకున్నారు.

**సేంద్రియ పద్ధతులతో సుస్థిర సాగు..**

రంగారెడ్డి జిల్లా సిద్దాపూర్ గ్రామానికి చెందిన చిన్న కమతాల మహిళా రైతు రాజేశ్వరి సేంద్రియ వ్యవసాయంలో తన అనుభవాలను వివరించారు.ఆవు పేడ,వేప ఆధారిత ఎరువులు,ఇతర సేంద్రియ పద్ధతులను ఉపయోగిస్తూ సుస్థిర వ్యవసాయం చేపడుతున్నట్లు తెలిపారు.ఈ సందర్భంగా ప్రగతిశీల మహిళా రైతులుసరస్వతి,లక్ష్మమ్మ, ప్రభావతి,వై.రాజేశ్వరి,లావణ్యలను సత్కరించారు.

**50మందికి పైగా మహిళా రైతుల హాజరు..**

కార్యక్రమం ప్రారంభంలో ఎన్ఏఏఆర్ఎమ్ ప్రిన్సిపల్ సైంటిస్ట్ డాక్టర్ సూర్యరాథోడ్ స్వాగతం పలికారు.ఎక్స్ఎస్ఎం విభాగం అధిపతి డాక్టర్ వెంకటకుమార్ మహిళా రైతు దినోత్సవ ప్రాముఖ్యతను వివరించారు.ప్రిన్సిపల్ సైంటిస్ట్ డాక్టర్ యామిని,సైంటిస్ట్ డాక్టర్ సుప్రియ కార్యక్రమ నిర్వహణలో సహకరించగా,సీనియర్ సైంటిస్ట్ డాక్టర్ రేష్మా గిల్స్ వందన సమర్పణ చేశారు.ఈ వేడుకల్లో సుమారు 50మంది మహిళా రైతులతో పాటు ఎన్ఏఏఆర్ఎమ్ సిబ్బంది,అధ్యాపకులు పాల్గొన్నారు.

# దసరా పూటా పంచాయతీ కార్మికులకు పస్తులేనా?

**ఉమ్మడి కరీంనగర్ జిల్లా ప్రతినిధి, అక్టోబర్15(నమస్తే ఉదయం):**

పల్లెలను పరిశుభ్రంగా ఉంచుతూ ప్రజలకు నిరంతరం సేవలందించే గ్రామపంచాయతీ కార్మికులకు పండుగ వేళ కూడా వేతన కష్టాలు తప్పడం లేదు. నెలంతా కష్టపడి పనిచేసినా జీతాలు అందకపోవడంతో కార్మికుల కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. సద్దుల బతుకమ్మ, దసరా పండుగల సమయంలోనైనా వేతనాలు చెల్లించకపోవడంపై తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కొప్పుల శంకర్ ఆవేదన వ్యక్తం చేశారు. పెండింగ్‌లో ఉన్న సెప్టెంబర్ నెల వేతనాలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు.



**పండుగ పూటా ఆర్థిక ఇబ్బందులే!**

జిల్లావ్యాప్తంగా గ్రామపంచాయతీల్లో పనిచేస్తున్న బహుళ ప్రయోజన కార్మికులకు ఈ నెల 15వ తేదీ వచ్చినా గత నెల వేతనాలు అందలేదని కొప్పుల శంకర్ తెలిపారు. ప్రభుత్వం చెల్లిస్తున్న నెలకు రూ.9,500 అతి తక్కువ వేతనాన్ని కూడా సకాలంలో ఇవ్వకపోవడం దారుణమన్నారు. పండుగ ఖర్చులకు డబ్బులు లేక, నిత్యావసరాలు తీర్చుకోలేక కార్మికుల కుటుంబాలు ఆందోళన చెందుతున్నాయని పేర్కొన్నారు. ఆన్‌లైన్‌లో పేర్లు నమోదు కాని కార్మికులకు సైతం నెలల తరబడి వేతనాలు బకాయి ఉన్నాయని, వారికి కూడా తక్షణమే చెల్లింపులు జరపాలని కోరారు.

**ప్రకటనలకే పరిమితమైన హామీలు**

ప్రతి నెలా ఒకటో తేదీన వేతనాలు చెల్లిస్తామని ముఖ్యమంత్రి ప్రకటించినప్పటికీ క్షేత్రస్థాయిలో అమలు కావడం లేదని శంకర్ విమర్శించారు. మంత్రి వర్గంలోనూ ఈ అంశంపై ప్రస్తావించినా కార్మికుల పరిస్థితిలో మార్పు కనిపించడం లేదన్నారు. ప్రభుత్వ ప్రకటనలకు, క్షేత్రస్థాయి వాస్తవాలకు పొంతన లేకుండా పోతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కొన్ని గ్రామపంచాయతీల్లో నిధులు అందుబాటులో ఉన్నప్పటికీ కార్మికులకు వేతనాలు చెల్లించేందుకు నిబంధనలు అడ్డంకిగా మారుతున్నాయని, ప్రభుత్వం నుంచి నిధులు రావడం లేదని అధికారులు చెబుతున్నారని తెలిపారు.

**పనులు చేయించుకోవడంలో ఉన్న శ్రద్ధ జీతాలివ్వడంలో ఏదీ?**

సద్దుల బతుకమ్మ, దసరా పండుగల ఏర్పాట్ల కోసం కార్మికులతో 12 నుంచి 15 గంటల పాటు పనిచేయించుకుంటున్నారని శంకర్ పేర్కొన్నారు. పండుగల నిర్వహణకు కార్మికుల సేవలు అవసరమైనప్పుడు, వారికి వేతనాలు చెల్లించే విషయంలో మాత్రం ఎందుకు నిర్లక్ష్యం వహిస్తున్నారని ప్రశ్నించారు. నెలంతా పనిచేసిన కార్మికులకు పండుగ వేళ కూడా జీతాలు అందకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు.ప్రభుత్వం వెంటనే స్పందించి గ్రామపంచాయతీ కార్మికుల పెండింగ్ వేతనాలను విడుదల చేయాలని, ఆన్‌లైన్‌లో పేర్లు నమోదు కాని కార్మికులకు కూడా బకాయిలు చెల్లించాలని యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. సమస్యను పరిష్కరించకపోతే కార్మికులందరినీ సమీకరించి జిల్లా పంచాయతీ అధికారి కార్యాలయం ఎదుట ఆందోళన చేపడతామని కొప్పుల శంకర్ హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా ఉపాధ్యక్షుడు కాశిపాక శంకర్, కమిటీ సభ్యులు అలిశెట్టి రామానుజన్, వడ్లూరి లక్ష్మీనారాయణ, కాడ శేఖర్ తదితరులు పాల్గొన్నారు.



# బతుకమ్మ సంబరాల్లో కౌన్సిలర్ చంద్రశేఖర్ దంపతులకు ప్రథమ బహుమతి

**జోగులాంబ గద్వాల జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 15(నమస్తే ఉదయం):**

గద్వాల పట్టణంలోని తేరు మైదానంలో గురువారం నిర్వహించిన బతుకమ్మ సంబరాల్లో 28వ వార్డు కౌన్సిలర్ జి. చంద్రశేఖర్ దంపతులు ప్రథమ బహుమతి సాధించారు. వారు రంగురంగుల పూలతో అందంగా తీర్చిదిద్ది తీసుకొచ్చిన బతుకమ్మ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. విజేతలకు జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా, ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి, గద్వాల మున్సిపల్ చైర్ పర్సన్ తుమ్మల జయలక్ష్మి ప్రథమ బహుమతిని అందజేసి అభినందించారు. సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుతూ సామాజిక కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనడం అభినందనీయమని వారు కొనియాడారు. బహుమతి అందుకోవడంపై చంద్రశేఖర్ దంపతులు సంతోషం వ్యక్తం చేశారు.

# లయన్స్ క్లబ్ ప్రోత్సాహంతో నేత్రదానం

**ఉమ్మడి కరీంనగర్ జిల్లా ప్రతినిధి, అక్టోబర్15(నమస్తే ఉదయం):**



దివంగత గంటా రమణయ్య (65 ఏళ్లు) మరణానంతరం వారి కుటుంబ సభ్యులు నేత్రదానానికి ముందుకు రావడం అభినంద నీయం. మానవత్వం, కరుణ , సమాజ సేవ అనే గొప్ప సందేశాన్ని చాటిచెప్పినందుకు కరీంనగర్ లయన్స్ క్లబ్ వారికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తోంది. కరీంనగర్‌లోని మెడికోవర్ హాస్పిటల్స్‌లో ఆయన కన్నుమూసిన తర్వాత, కోల అన్నారెడ్డి , మ్యాడం శివకాంత్ పటేల్ కుటుంబ సభ్యులను ప్రోత్సహించి, ఈ గొప్ప నిర్ణయం తీసుకునేలా ప్రేరేపించారు. వైద్య బృందం సహకారంతో , ఎల్.వి. ప్రసాద్ కంటి ఆసుపత్రి ప్రతినిధి గాజుల సతీష్ సమన్వయంతో నేత్రదాన ప్రక్రియ విజయవంతంగా పూర్తయింది. దీని ద్వారా చూపు కోల్పోయిన వారికి తిరిగి దృష్టిని ప్రసాదించే అవకాశం కలిగింది.దివంగతుల కుటుంబ సభ్యులలో ఆయన భార్య గంటా రమ, కుమారుడు గంటా వంశీ, కోడలు గంటా అర్చన, అవుతూరి కవిత-రంజిత్, ఆకుల వీణ-యాదయ్య, డాక్టర్ అవుతూరి మీరా, డాక్టర్ అవుతూరి కిషన్, కోల అన్నారెడ్డి, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ కరీంనగర్ జిల్లా కార్యవర్గ సభ్యులు ఉన్నారు.ఈ నేత్రదాన కార్యక్రమం, నేత్రదానంపై ప్రజల్లో అవగాహన పెంచుకోవాల్సిన అవసరాన్ని కార్నియల్ అంధత్వంతో బాధపడుతున్న వారికి అండగా నిలవాల్సిన ప్రాముఖ్యతను తెలియజేస్తోంది. ఇతరుల జీవితాల్లో వెలుగులు నింపేందుకు, ప్రజలందరూ ముందుకు వచ్చి నేత్రదానానికి ప్రతిజ్ఞ చేయాలని కరీంనగర్ లయన్స్ క్లబ్ కోరుతోంది.క్లబ్ సభ్యులు దివంగతుల కుటుంబానికి తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ, వారి మానవతా దృక్పథాన్ని అభినందిస్తున్నారు. అలాగే, కుటుంబ సభ్యులను ప్రోత్సహించి, నేత్రదానం అనే ఈ గొప్ప కార్యాన్ని ముందుకు తీసుకెళ్లినందుకు కోల అన్నారెడ్డి , చింతల కిషన్, మ్యాడం శివకాంత్ పటేల్ కృషిని క్లబ్ ప్రత్యేకంగా అభినందిస్తోంది.



# రాష్ట్రస్థాయి ఎస్ జి ఎఫ్ కరాటే పోటీలకు ఎంపికైన కొత్తకోట గాడ్స్ ఆన్ వారియర్స్ విద్యార్థి

## నారాయణపేట జిల్లాలో ఉమ్మడి జిల్లా ఎస్ జి ఎఫ్ రాష్ట్రస్థాయి కరాటే పోటీల ఎంపిక

**కొత్తకోట, అక్టోబర్ 15 (నమస్తే ఉదయం)**

నారాయణపేట లోని ఏఆర్ఎం ఫంక్షన్ హాల్ లో ఉమ్మడి జిల్లా సెక్రెటరీ శ్రీనివాస్ రెడ్డి, డి వై ఎస్ ఓ వెంకటేశ్వర శెట్టి ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి కరాటే ఎంపికలు నడిచాయి ఈ పోటీలకు కొత్తకోటకు చెందిన గాడ్స్ ఆన్ వారియర్స్ షోతో ఖాన్ కరాటే అకాడమీ చెందిన విద్యార్థి రాష్ట్రస్థాయి కి ఎంపికయ్యారు. కే కార్తికేయ అండర్ 14 సంవత్సరాల 35 కేజీల విభాగంలో ఎంపికైంది.ఈ విద్యార్థిని ఉమ్మడి జిల్లా సెక్రటరీ డివైఎస్ఓ , క్లబ్ ఫౌండర్ అబ్దుల్ నబీ క్లబ్ సీనియర్ కరాటే మాస్టర్స్ జి హరీష్ యాదవ్ జాఫర్ సాదిక్ ఇంతియాజ్ విద్యార్థిని అభినందించారు.



# భరత్ నగర్‌లో ఘనంగా అబ్దుల్ కలాం జయంతి వేడుకలు

## కలాం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించిన భరత్ నగర్ సంక్షేమ సంఘం

**కూకట్‌పల్లి, అక్టోబర్ 15 ( నమస్తే ఉదయం)**

కూకట్‌పల్లి నియోజకవర్గం భరత్ నగర్ కాలనీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో భారత మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు.సంక్షేమ సంఘం అధ్యక్షుడు డాక్టర్ పి. నాగిరెడ్డి ఆధ్వర్యంలో ఈ రోజు ఉదయం సంక్షేమ సంఘం కార్యాలయం వద్ద కలాం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాగిరెడ్డి మాట్లాడుతూ కలాం దేశానికి చేసిన సేవలు మరువలేనివని, యువతకు ఆయన జీవితం స్ఫూర్తిదాయకమని కొనియాడారు.ఈ కార్యక్రమంలో కాలనీవాసులు సూర్యనారాయణ మూర్తి, నాగేశ్వరరావు, అఫ్జల్ పాషా, బాబు, డేవిడ్, శ్రీనివాస్ గౌడ్, వెంకటేష్ యాదవ్, రాంబాబు, వెంకటేష్, నరేష్ కుమార్, మధు, సంతోష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



# లక్ష్మీ గూడ రాజీవ్ గృహకల్పలో ఘనంగా దుర్గామాత నవరాత్రి ఉత్సవాలు

**రాజేంద్రనగర్, అక్టోబర్ 15(నమస్తే ఉదయం)**

అత్తాపూర్ సర్కిల్ పరిధిలోని లక్ష్మీగూడ రాజీవ్ గృహకల్ప భవన సముదాయంలో శ్రీ దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. గురువారం స్థానిక నాయకురాళ్లు లలితారెడ్డి, శరణమ్మ, పుష్పమ్మ ఆధ్వర్యంలో జరిగిన ఉత్సవాలలో భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.



# పోలీస్ ఫ్లాగ్ డే.. ఫోటోగ్రఫీ, షార్ట్ ఫిలిమ్స్ పోటీలకు ఆహ్వానం

**ఉమ్మడి కరీంనగర్ జిల్లా ప్రతినిధి, అక్టోబర్15(నమస్తే ఉదయం):**

పోలీస్ ఫ్లాగ్ డే సందర్భంగా రామగుండం పోలీస్ కమీషనరేట్ పరిధిలోని పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాల యువత, ఔత్సాహిక ఫోటో గ్రాఫర్ల కోసం ఫోటోగ్రఫీ, షార్ట్ ఫిలిమ్స్ పోటీలు నిర్వహిస్తున్నట్లు రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా తెలిపారు. శాంతిభద్రతల పరిరక్షణలో, సమాజ రక్షణలో విధి నిర్వహిస్తూ ప్రాణత్యాగం చేసిన అమర పోలీసుల సేవలు,త్యాగాలనుస్మరించుకుంటూ అక్టోబర్ 21న నిర్వహించే పోలీస్ ఫ్లాగ్ డే సందర్భంగా ఈ పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారుపోలీసుల త్యాగాలు,సేవలు, విధి నిర్వహణలో వారి ప్రతిభ ను ప్రతిబింబించే విధంగా ఫోటోలు,షార్ట్ ఫిలిమ్స్ రూపొందించాలనిసూచించారుఆసక్తి గల వారు పోలీసులకు సంబంధించిన అంశాలపై తీసిన మూడు ఫోటోలు, మూడు నిమిషాలకు మించని ఒక షార్ట్ ఫిలింను ఈ నెల 23వ తేదీ సాయంత్రంలోగా రామగుండం పోలీస్ కమీషనరేట్ స్పెషల్ బ్రాంచ్ (ఎస్‌బి) కార్యాలయం లో సమర్పించాలి. ఫోటోలు 10 x 8 అంగుళాల పరిమాణంలో ఉండాలి. షార్ట్ ఫిలింను పెన్ డ్రైవ్‌లో పూర్తి వ్యక్తిగత వివరాలతో సమర్పించాలి.కమిషనరేట్ స్థాయిలో ఎంపికైన మూడు ఉత్తమ ఫోటోలు, మూడు ఉత్తమ షార్ట్ ఫిలిమ్స్‌ను రాష్ట్రస్థాయి పోటీలకు హైదరాబాద్‌లోని డీజీపీ కార్యాలయానికి పంపించనున్నట్లు సీపీ తెలిపారు.యువత, ఔత్సాహిక ఫోటోగ్రాఫర్లు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని పోలీసుల సేవలు, త్యాగాలను సమాజానికి చాటి చెప్పేవిధంగా తమ ప్రతిభను ప్రదర్శించాలని రామగుండం పోలీస్ కమీషనర్ అంబర్ కిషోర్ ఝా పిలుపునిచ్చారు.





# ప్రకృతి ఆరాధనకు ప్రతీక బతుకమ్మ పండుగ: ఇంచార్జీ కలెక్టర్ డాక్టర్ కిరణ్మయి

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 15 (నమస్తే ఉదయం)**

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగ ప్రకృతిని ఆరాధిస్తూ, మానవాళిని ప్రకృతికి దగ్గర చేసే గొప్ప వేడుక అని ఇంచార్జీ కలెక్టర్ డాక్టర్ కిరణ్మయి అన్నారు.గురువారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం (ఐడీఓసీ) ఆవరణలో మహిళా శిశు సంక్షేమ శాఖ, వైద్య ఆరోగ్య శాఖ, మెప్మా, అడల్ట్ ఎడ్యుకేషన్ తదితర శాఖల ఆధ్వర్యంలో నిర్వహించిన బతుకమ్మ వేడుకల్లో ఇంచార్జీ కలెక్టర్ డాక్టర్ కిరణ్మయి పాల్గొని పూజలు నిర్వహించి వేడుకలను ప్రారంభించారు. అనంతరం మహిళా ఉద్యోగులతో కలిసి బతుకమ్మ ఆడి సంబరాల్లో పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఇంచార్జీ కలెక్టర్ మాట్లాడుతూ, ప్రకృతిలో లభించే వివిధ రకాల పూలతో బతుకమ్మను అందంగా పేర్చి పూజించడం ఈ పండుగ ప్రత్యేకత అని తెలిపారు. మహిళలకు ఎంతో ప్రత్యేకమైన బతుకమ్మ పండుగ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతిబింబంగా నిలుస్తోందని పేర్కొన్నారు. రాష్ట్రానికే పరిమితం కాకుండా దేశవ్యాప్తంగా, ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిన ఈ పండుగ తెలంగాణ ప్రజల సాంస్కృతిక వైభవాన్ని చాటిచెబుతోందని అన్నారు. మహిళలంతా ఒకచోట చేరి తొమ్మిది రోజులపాటు ఆనందోత్సాహాలతో బతుకమ్మ పండుగను ఘనంగా జరుపుకుంటారని తెలిపారు. ప్రకృతిని గౌరవిస్తూ, మన సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించేలా ప్రతి ఒక్కరూ పండుగలను సంప్రదాయబద్ధంగా జరుపుకోవాలని ఆమె సూచించారు.ఈ కార్యక్రమంలో మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి శాంతిశ్రీ, అడల్ట్ ఎడ్యుకేషన్ అధికారి అనిత, వైద్య ఆరోగ్య శాఖ, మెప్మా, రెవెన్యూ తదితర శాఖలకు చెందిన మహిళా అధికారులు, సిడిపిఒలు,ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

Printed and Published **MEKALA DAMODAR REDDY** on behalf of VANITHA Publications, and Printed at Vanitha Graphics, H.No. 3-3-76/123/21, Maruthi Enclave, Attapur, Rajendra Nagar, Ranga Reddy, Telangana-500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally , NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: M.DAMODHAR REDDY. "RNI. Title- Code: TELTEL/2023/87699**. Cell: 9492148733